

# పర్సులో పులి

పి. శ్రీనివాసశాస్త్రి

ఏడువందల రూపాయలు .... నలభై పైసల చిల్లర.... ఆవిడ రాసిచ్చిన సరుకుల చీటీ.

ముప్ఫైరోజుల కష్టార్జితం .. 720 గంటలలో 480 గంటలు నిద్రపోవడానికీ నిద్రపట్టకపోవడానికీ తినడానికీ తినక పోడానికీ ఇంకా అనేకానేక అసందర్భాలకి పోగా, రోజుకు ఎనిమిదిగంటలు చొప్పున టైప్‌మిషన్‌మీద బండిబారిన తన కళ్ళ గడియారంలో సెకండ్ల ముల్లుతో పోటీపడి – టీ పడి – పడి– డి . . .న ఫలితం!

పోయినందుకు మూడో వ్యక్తి నెవర్నయినా తిట్టుకోగలిగితే, నా పర్సు కొట్టేసిన పాపానికి నువ్వూ – నీ పిల్లా జల్లా, పెళ్ళాం, తల్లీ అటు ఏడేసి తరాలూ, ఇటు ఏడేసి తరాలూ దుంపనాశనమైపోవాలి అని శపించే అస్కారం ఉంటే మనసు కదో తృప్తి.

పర్సు పోవడానికి దేశంలోని వేలు లక్షల పిక్‌పాకెటర్లలో ఏ ఒక్కడూ బాధ్యుడు కాడు. కేవలం ఇదిగో ఈ నేను ...... సవాలక్ష సమస్యల దాడిలో పరధ్యానాన్ని ఆశ్రయించి మరో సమస్య తెచ్చి పెట్టుకున్నాను.

జీతాల రోజని నవ్వు అతిగించుకుని

ఎదురొచ్చే 'ఆవిడ' దరహాసం ఏమై పోవాలి?

ప్రొద్దున్నే ప్రత్యక్షమయ్యే పాలమ్మికీ, చీపురుకట్టతో నిలబడిపోయే పనిమనిషికీ, ఎందుకైనా మంచిదని ఎప్పుడూ రెండు బట్టలు ఉంచేసుకొనే దోభీకీ "ఆయన యింట్లో లేరని" ఆవిడ చెబుతుంటే, రెండుగదుల అద్దెకొంపలో బయటపడకుండా ఎలా దాక్కోవాలి?

మళ్లా ముప్పైఒకటో తేదీ దాకా ఎలా బతకాలి (లేదా) ఎలా చావాలి?

సవాలక్ష అంకెకి కొత్తగా తోడయ్యే సమస్య లెన్ని?

? ? ? ? ?

వాటికి సమాధానా లేవీ?

* * *

రెండువందల రూపాయలు... నలభై పైసల చిల్లర. పెళ్లాం రాసిచ్చినది కాబోలు సరుకుల చీటీ.

చీటీ చదివితే అది అన్నీ నిండు కొన్న కొంపలా ఉంది.

'నిండు పర్సు పోతే నిండుకున్న కొంప కెంత కష్టం?' అని ఇంకా అన లేదా శ్రీశ్రీ?

ఎవడో అక్షరాలా దౌర్భాగ్యుడు

పర్సులో రెండువందలున్నా, పర్సు ఆ బరువుని నెలకొక్కసారే, అదైనా ఓ నాలుగైదు గంటలు మాత్రమే మొయ్యగలిగేదిగా ఉంది. నలిగినంత నలిగి, చిరిగినంత చిరిగి ఇంకెలా నలగాలో, ఇంకెలా చిరగాలో తెలియ నట్టున్న ఈ పర్సు నిస్సందేహంగా దేశంలోని వేలు లక్షల చిరుద్యోగులలో ఒక్కడిదై ఉండాలి

ఈ డబ్బు నిజంగా శ్రమే తప్ప సుఖం తెలియని రెండు చేతులపై ఉండాలి

ఈపాటి కతగాడు జేబులు వెతుక్కోడం మిన్ను విరిగి మీదపడడం జరిగిపోయి ఉండాలి.

నీకు దొరికిన అదృష్టం విలువెంత?

ఎదుటివాడు పోగొట్టుకున్న విలు వంత!

ఇది అదృష్టవంతుడి సాపేక్ష సిద్ధాంతం!!

ఎన్నో కష్టనష్టాల కూడికలు తీసి వేతల మధ్య సతమతమవుతున్న రోజున కాలికి తగిలింది సాక్షాత్ శ్రీలక్ష్మి....

గొప్ప చిక్కొచ్చి పడిందని తం భారంతో చేతులు జేబులో పెట్టి, చూపులు నేలమీద ఆన్చి నడుస్తుంటే గొప్ప డబ్బొచ్చి పడింది.

బుర్రలో చీకటి తెరల్ని ఎత్తెయ్!

ఆనందపు బురఖా ముఖానికి తగిలించెయ్!

కాస్సేపు విషాదం మరచిపో.

ఏదీ — గుండెమూలల్లో మూలుగుతున్న కోరికల జాబితా బయటికి లాగు.

పెళ్లానికి కంచి పట్టుచీరా?

కంచి పట్టుచీర బాగుంటుంది కంచి

పట్టుచీర కట్టుకోకపోయినా పెళ్లాం బాగుంటుంది.

ఊ.. వ్హాట్ నెక్ట్స్ —

అమ్మాయికి వోణీయా.. ?

"వోణీలు వేసుకోకుండా బళ్ళోకి రావొద్దమ్మాయ్!" అని కోప్పడి ఇంటికి పంపేసిందిట హెడ్‌మిస్ట్రెస్!

అమ్మాయి ఏడుస్తూ తల్లికి చెబితే, తల్లి నసుగుతూ తనతో చెప్పింది.

ఆడపిల్లలకి ఫీజు వొద్దన్నది వోణీలు కొనడానికే అయ్యుండాలి వోణీలు కట్టుకొని అమ్మాయి తిరుగుతుంటే, "అమ్మాయికి పెళ్లెప్పుడు చేస్తార"ని గూఢచారి పిన్నిగార్ల పలకరింపులు.

పిల్లకు వోణీలూ, పెళ్ళికొడుకులూ ఒకేసారి బేరమాడతగును.

అవును ఒక వోణీ ఎన్ని రూపాయలు? ఒక పెళ్ళికొడుకు ఎన్ని రూపాయలు? ఒక పెళ్ళికొడుకును కొనే డబ్బుతో ఎన్ని వోణీలు కొనవచ్చును?

లాభంలేదు. ఈ వోణీని మరచిపోక పోతే కథ ముందుకు నడిచేట్టు లేదు.

ఆ తరువాత నీ కోరికల లిస్టులో మూడో దేమిటో చెప్పు.. అక్కర్లేదు అక్కర్లేదు.

అదిగో ఎదురుగా ——

మాంట్ గోమరీ బార్ అండ్ రెస్టో రెంట్!

అక్కడ అన్ని రకముల స్వదేశీ విదేశీ మద్యములు సరసమైన ధరలకు (సామాన్యుడికో ధరల సరసాలా?) దొరుకును.

ఐనా ధరలకు దొరకడమేమిటి? డబ్బిచ్చి కొంటే దొరకడం ఎందుకవుతుంది? ఈ చేతిలో పర్సులా ఎడివనో కొంపముంచి రోడ్డుమీద జారి పడి మరోడి కాలికి తగిలితేనే అది దొరకడం అవుతుంది.

ఏవిటో తెలుగుభాష చాలా కన్ఫ్యూజ్ చేసేస్తోందండీ మనుష్ని!

తెలుగు భాషను సంస్కరించాలనే ఆలోచనవి, సుబ్బరంగా ఓ పెగ్ విస్కీ కొట్టేయాలన్న ఆలోచన ఓవర్‌టేక్ చేయగా మాంట్ గోమరీలోకి అలెగ్జాండర్లా నడిచాడు అచ్యుతరావు.

ఆ లెగ్జాండర్ని చూసి బేరర్ సాల్యూట్ చేయబోయి అతని ఒదులొదులు చొక్కా, బురదంటకుండా పైకి మడచిన ఫాంటూ, గీసుకోని గెడ్డం, దువ్వుకోని జుట్టూ చూసి టక్కున ఆ పని మానేశాడు. ఐతే అలెగ్జాండర్ అతను చేయబోయిన సాల్యూట్ చిరునవ్వుతో స్వీకరించి ప్రతినమస్కారం చేసేసి దెబ్బతిన్నాడు.

ఆ దృశ్యం కన్పడగానే తిలకిస్తున్న ఇద్దరు కష్టం తెలియని కష్టమర్లు పరాయివాడు ఫూలయినందుకు ఫూలిష్‌గా నవ్వుతున్నారు

"ఎక్స్‌క్యూజ్ మీ. కెన్ఐ సిట్

హియర్," అన్న అచ్యుతరావు ఇంగ్లీషుని గౌరవించి సీటిచ్చారు.

సీటు గెలిచిన అచ్యుతరావు చిటికేసి పిలిచాడు బేరర్ని. చిటికెలో వొచ్చి అచ్యుతరావు ఆర్డరు మోసుకుపోయిన బేరర్ ఆ తర్వాత ఎన్ని చిటికెలేసినా ఐపూ మచ్చాలేదు

తదనంతరం —

గొప్ప మీమాంస బయల్దేరింది

"మనిషి ఎందుకు చస్తాడు సార్....?" అనడిగాడు అరబుడ్డి తలకెక్కించుకొన్న పూలిష్ కష్టమర్లిద్దరిలో ఒకడు- సాక్షాత్తు అచ్యుతరావుని.

"మనిషి బతకడానికి పుట్టడం ఒక్కటే కారణమైతే - చావడానికి సవాలక్షకారణా లున్నాయి," అని తేలిగ్గా సెలవిచ్చాడు అచ్యుతరావు

ఆ సవాలక్ష కారణాలేమిటో చెప్పందే వదలనని భీష్మించాడు పూలిష్కష్టమర్లలో రెండోవాడు.

'చచ్చాను' అనుకున్నాడు అచ్యుతరావు. అంతలో బేరర్ ఆర్డర్ మోసు కొచ్చి అచ్యుతరావుని బతికించాడు.

ఐతే సహకష్టమర్లిద్దరూ అచ్యుతరావుని చంపైడం ఇంకా మానుకోలేదు. "మనిషి చచ్చిపోకుండా ఎవరైనా మందు కనుక్కుంటే ఎలా ఉంటుంది. ఇంతోటి సైంటిస్టు లున్నారు కదా. వెధవది ఏ ఒక్కడికీ ఆమాత్రం తట్టలేదెందుచేత సార్ " పాశుపతాస్త్రం వదిలాడు

పీడి నోరు నొక్కాలంటే తానో బ్రహ్మాస్త్రం వదలాలి బ్రహ్మాస్త్రం అంటే గుర్తుకొచ్చింది - అంగోస్త్రా లసలే లేవు- ఈ డబ్బులోంచి రెండు కొనుక్కోకపోతే లాభం లేదు. నవ గ్రహాలలో ఏ గ్రహం మీదున్నాయి అంగోస్త్రాల ధరలు?

నవగ్రహాల పేర్లు గుర్తుచేసుకొంటూ అచ్యుతరావు గ్లాసు ఖాళీచేయడంలో మునిగిపోయాడు

* * *

బాధలకు అలవాటుపడితే కన్నీళ్లు ఉండవు.

బాధపడ్డాన్ని బాగా ప్రాక్టీసు చేసాడు ముకుందం. పర్సుపోయిందని నెత్తీనోరు కొట్టుకుని ఏడవకుండా మున్సిపల్ పార్కులో బాధ కక్కేసి, వంపునీళ్లతో నోరు కడిగేసుకుని కాళీజేబుతో అత్యంత సాహసోపేతంగా ఇంట్లోకి అడుగుపెట్టి సంసార వృక్షం నీడలో పడి నిద్రపోయాడు.

* * *

కోర్కెల జాబితా తీసిన కొద్దీ ఒస్తోంది అచ్యుతరావుకి. డౌన్ విత్ ది మాంట్ గోమరీ డౌన్ విత్ ఎవ్విరి బార్ అండ్ రెస్టోరెంట్ . అని తిట్టుకుంటూ రోడ్డుమీద కొచ్చాడు.

గంట వరదాకి యాభై రూపాయలు మింగిన మాంట్ గోమరీ ముందు బాబిలోన్ లో అలెగ్జాండర్ లా డీలాపడి చౌరస్తాదగ్గర మిగిలిపోయాడు అచ్యుతరావు.

ఈ యాభై రూపాయిలతో ఇంటి కేదన్నా పనికొచ్చే వస్తువు పట్టిగెడితే బాగుండేది అంత డబ్బూ పట్టుకెళ్ళి "విస్కీ" పోసాను అని బాధ మిగుల్చుతున్నాడు

రానీ రానీ

వస్తే రానీ

కష్టాల్ నష్టాల్

కోపాల్ తాపాల్

రానీ రానీ

కానీ.... కానీ

హాసం...లాసం

ఎదురుగా కిళ్ళీ కొట్లో అట్టహాసంగా ఉన్న (అట్టమీద అందమైన అమ్మాయి హాసం) పత్రిక కొన్నాడు.

ఈ అట్టమీద అందంగా నవ్వుతున్న అమ్మాయి పత్రికలోపల కట్ రూల్స్‌తో కట్టిన బాక్సులో బట్టలు మార్చుకుంటోంది. ఎవరో ప్రఖ్యాత ఫోటోగ్రాఫరు తీసిన సదరు ఛాయా చిత్రానికి అవార్డుకూడాను.

డబ్బుకోసం ఫోటోగ్రాఫర్ ముందు బట్టలు మార్చుకున్న అమ్మాయి పరిస్థితులేమిటి ?

....తల దిమ్ము....కణతలు పేలిపోతున్నాయి.... పత్రికని చెత్తకుండీలోకి విసిరేశాడు. పత్రికని కొన్నప్పుడు కంటే పారేసినప్పుడే మంచి థ్రిల్ కలిగింది అచ్యుతరావుకి.

తప్పతాగేవాళ్ళు కొందరు ।

తాగి తప్పేవాళ్ళు కొందరు ।।

• • •

నిన్నటి రోజే మళ్ళీ మొదలైంది ముకుందానికి. నిన్నటికీ నేటికీ తేడా అల్లా ఒక్కటే-

సాయంత్రం విందు జీతం అందుకొంటానన్న ఆశ నిన్న.

ముప్పై రోజూ ఎలా గడపాలన్న దిగులు నేడు.

• • •

ఒచ్చినందుకు సంతోషం లేదు. ఒచ్చింది ఒచ్చినట్టే పోయిందని దిగులే మిగిలింది. పైగా వాసన భార్య పసిగడుతుందేమోనని రోడ్డుమీదే రాత్రంతా సంచారం.

పర్సు పోగొట్టుకున్నవాడొచ్చి పీక పట్టుకుంటాడని బెదురు....

పోలీసుల అనుమానపు చూపులు....

ఎవరన్నా మీదపడి కొడతారేమోనని భయం.

తల దాచుకుందుకి తలుపులు తెరిచున్న కొంప ముందు నిలబడితే గుమ్మం దగ్గర గాజుల గలగల మనసు లోపల మూల మూలల నుంచి క్రమంగా ఓ కోరిక ఎదిగి ఎదిగి మనసంతా కమ్మేయడం.

జీవితంలో మొదటిసారి క్షమించరాని తప్పు చేసేయడం. తనకు తానే కొత్తగా చీత్కారంగా అనిపించడం.... [illegible]

చీర కొనడానికి, కూతురుకి వోణీ కొనడానికీ యాభై ఆలోచించానే. చివరకు నా వ్యక్తిత్వాన్నే కోర్కెలకి అమ్మేశానే.... ఈ వయస్సులో ఏవిటి నాకీ పాపపుటాలోచన అనుకొంటూ తన తలని తనే కరికేసుకోవడం.

చివరికి పాప పరిహారం కోసం అలక్ష్యంగా కలిగిన జ్ఞానోదయంతో ఒక్క బాకీ తీరినా తీరినట్టేనని ఉదయం ఆఫీసు కొస్తూ విశ్వనాథ్ కొట్లో బాకీ తీర్చేయడం.

డబ్బు! జిందాబాద్!

డబ్బు! జిందాబాద్!!

* * *

ఆఫీసు క్యాంటీన్‌లో కాఫీ తాగుతున్నా నీరసంగానే ఉన్నాడు ముకుందం.

కారణం ఏమిటని అడిగాడు అచ్యుతరావు.

"పర్సు పోయిందిరా చిన్నా. రెండు వందల రూపాయలు.... నలభై పైసల చిల్లర.... ఆవిడ రాసిచ్చిన పచారుల చీటీ...."

అచ్యుతరావుకి తాగుతున్న కాఫీ కరిగించిన ఇనుములా గొంతు మండించింది.

విన్నటి మాంట్‌గోమరి విస్కీ భక్ష్యన వాంతిలా పైకి తన్నుకు రాబోయింది.

'మనిషి ఎందుకు చస్తాడు సార్?' ఒక ప్రశ్న.

అర్ధరాత్రి తెరచుకున్న తలుపుల దగ్గర గాజుల గలగల... మరు నిమిషంలో ఆ ఇంటి లోపల తాను జంతువయి పోవడం.... ఒళ్లు జలదరించింది అచ్యుతరావుకి.

'మనిషి చచ్చిపోకుండా ఎవరైనా మందు కనుక్కుంటే ఎలా ఉంటుంది సార్?'- మళ్ళీ వాడిదే ప్రశ్న.

అంతా ఒక సెకను.

ఆ తరువాత దృశ్యం ఎప్పటిలాగే ఉంది.

ఎదురుగా కాఫీ తాగుతున్నది ఎప్పటి ముకుందమే.... కాని ఈ కాఫీని ఆఫర్ చేస్తున్నది ఎప్పటి అచ్యుతరావు కాదు.

"నువ్వు చాలా అదృష్టవంతుడివిరా ముకుందం. డబ్బు సులభంగా పోగొట్టుకున్నావ్. నేనెంత కష్టపడ్డానో తెలుసా!" అన్నాడు.

